క్లుప్తంగా

సీఎంకు పోస్ట్‌కార్డులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ కాంట్రాక్ట్ కార్మికులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి తమ సమస్యలు తెలుపుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా.. ఎన్ని యూనియన్లు మారినా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం జరగటం లేదన్నారు. కార్మికుల సమస్యలు తీరేవరకు ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడెల్లి యాకయ్య, కరుణాకర్, షకీల్, చిట్టిబాబు, సాయి మనోజ్, లత, అనసూర్య, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పృథ్వీ

ఇల్లెందు: పీడీఎస్‌యూ 50వ వసంతాల సభను ఈ నెల 30న ఉస్మానియా యూనివర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.పృథ్వీ తెలిపారు. గురువారం ఇల్లెందులోని మాస్‌లైన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నక్సల్‌బరీ, శ్రీకాకుళం, గోదావరిలోయ పోరాటాల ప్రేరణతో కత్తుల వంతెన మీద నెత్తుటి ప్రయాణం చేసిన సంఘం పీడీఎస్‌యూ 50 ఏళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ ఉద్యమ ప్రస్థానంలో జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖరప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, రమణయ్య, సాంబయ్య అమరులయ్యారని పేర్కొన్నారు. ఈ 50 ఏళ్ల ఉద్యమాన్ని సమీక్షించుకుని ముందుకు సాగేందుకు వసంతాల సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.సాయి, శివప్రశాంత్, వంశీవర్ధన్, పార్థసారథి, గంగాధర్, గణేష్, ప్రణీత్, రాజ్, అబ్దుల్, గనీ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సెంట్రల్ లైటింగ్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఇల్లెందురూరల్: సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో సెంట్రల్ లైటింగ్ కాంతులు విరజిమ్మనున్నాయి. ఆరేళ్ల క్రితం రహదారి వెడల్పులో భాగంగా మంజూరైన నిధులతో సుభాష్‌నగర్ కూడలిలో రింగ్‌తోపాటు, కూడలి నుంచి ప్రభుత్వ డిగ్రీ కాళాశాల వరకు డివైడర్ నిర్మించారు. సెంట్రల్ లైటింగ్ కోసం స్తంభాలు కూడా బిగించారు. కానీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో అవి శిలావిగ్రహాలుగా మిగిలిపోయాయి. ఇంత ఖర్చు చేసినా రాత్రిపూట అంధకారాన్ని చేదించలేకపోయాయి. ఈ పరిస్థితిలో ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో సెంట్రల్ లైటింగ్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు మరమ్మతులు, నూతన లైట్ల ఏర్పాటు పనులను సంబంధిత కాంట్రాక్టర్ గురువారం ప్రారంభించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- వరద బాధితులను ఆదుకోవాలని

సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దఎత్తున వరదలు వచ్చాయని, రాష్ట్ర వ్యాప్తంగా భారీనష్టం జరిగిందని, ఈ విపత్కర పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షాలు, వరదల కారణంగా ఎంతోమందికి ఇబ్బంది ఎదురైందని, బాధితులను ఆదుకునేందుకు కేంద్రం తక్షణమే రూ.10వేల కోట్ల నిధులు అందజేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన సహాయం చేస్తూనే ఉందని, నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసినప్పుడు రూ.5,644 కోట్లుగా తేలిందని, ఆ తర్వాత క్షేత్రస్థాయి పర్యటన లెక్కల ప్రకారం నష్టం రూ.6వేల కోట్లుగా తేలిందని వివరించారు. ఈ మొత్తాన్ని కేంద్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఖమ్మం జిల్లాలో మున్నేరు కారణంగా వేలాది ఇళ్లు నేల మట్టమయ్యాయని, ప్రజలు కట్టుబట్టలతో మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. తినేందుకు ఆహారం, తాగేందుకు నీరు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఏళ్ల క్రితం కట్టుకున్న ఇళ్లు కళ్లముందే నీటిలో కొట్టుకుపోతుంటే నిస్సహాయంగా ప్రాణాల కాపాడుకునేందుకు పరుగులు తీశారని వాపోయారు. చివరికి ఒక కుటుంబానికి చెందిన భార్యాభర్తలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోగా, పిల్లలు మాత్రమే మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. కిన్నెరసాని ప్రభావంతో పాల్వంచ మండలంలోని పలు గ్రామాలు నీట మునిగాయని, రాకపోకలు నిలిచిపోయినట్లు చెప్పారు. సీపీఐ ఆధ్వర్యంలో బాధితులను ఆదుకునేందుకు నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు, ఇళ్ల నష్టానికి రూ.16,500 ఇస్తోందని, ప్రస్తుత ధరల ప్రకారం పరిహారం అందించాలన్నారు. బాధితులను పరామర్శించేందుకు వచ్చిన కేంద్ర మంత్రుల బృందం కంటితుడుపు చర్యగా పర్యటన సాగించారని, బాధితులకు స్పష్టమైన హామీ ఇవ్వలేదని మండిపడ్డారు. ఎక్కువగా మాట్లాడే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిర్వహించాల్సిన బాధ్యతను విస్మరించారని ఎద్దేవా చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, కె.సారయ్య, నరాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, మున్నా లక్ష్మీకుమారి, ఎస్‌డీ సలీం, ఎల్లయ్య, సలిగంటి శ్రీనివాస్, ఏపూరి బ్రహ్మం, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు

పాల్వంచ: మండలంలోని శ్రీనివాసకాలనీ, పాండురంగాపురం గ్రామాల్లో రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలోని అంతరాయాలు తగ్గి, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడం సులభతరం అవుతుందన్నారు.

వరద బాధితులకు సాయం..

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం మంజూరు చేసిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పాల్వంచలోని 92 మంది వరద బాధితుల ఒక్కో కుటుంబానికి రూ.16,500 చొప్పున నష్టపరిహారం అందించడం జరుగుతుందన్నారు.

రక్షణ సూత్రాలు పాటించండి..

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికులు చాలామంది మృతి చెందారని, ప్రయాణాల్లో రక్షణ సూత్రాలు పాటిస్తే ఈ ప్రమాదాలను నివారించవచ్చని, సింగరేణి కార్పొరేట్ సెక్యూరిటీ జీఎం శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం కార్పొరేట్‌లోని సెక్యూరిటీ కార్యాలయంలో సెక్యూరిటీ సిబ్బందికి 46వ బ్యాచ్‌కి నిర్వహించిన ట్రాఫిక్ కంట్రోల్ శిక్షణ ముగింపు తరగతులు నేటితో ముగిశాయి. ముఖ్యఅతిథిగా శ్రీనివాసరావు హాజరయ్యారు. మాట్లాడుతూ.. సింగరేణి గనుల్లో ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయని కంపెనీ నివేదికల్లో తెలిపిందని పేర్కొన్నారు.

కార్మికులు ఇంటి నుంచి బయలుదేరే సమయంలో రోడ్డు రక్షణ సూత్రాలను కచ్చితంగా ఉపయోగించాలని, తద్వారా ప్రమాదాలు నివారించవచ్చని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాటిస్తూ, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ట్రైనీలుగా ఎంపికైన ఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.శ్రీనివాస్‌లకు బహుమతులు అందజేశారు. తదుపరి జ్యోతి అనాథ శరణాలయానికి నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ జాకీర్ హుస్సేన్, ట్రైనింగ్ అధికారి సత్యనారాయణ, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్

పాఠశాల క్రీడాపోటీలు ప్రారంభం

జూలూరుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి పాఠశాల క్రీడాపోటీలు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ డి.కరుణాకర్‌రెడ్డి, సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎంఈఓ గుగులోత్ వెంకట్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు క్రీడాస్ఫూర్తి పాటించాలన్నారు. విద్యార్థులకు భోజన వసతి, బహుమతులు ప్రదానం చేస్తున్న జూలూరుపాడు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య మహాసభ జిల్లా నాయకుడు పెండ్యాల ప్రసాద్‌రావును అధికారులు అభినందించారు.



కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

సమాజంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సాంబ

పాల్వంచ: విద్యార్థులు సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎ.సాంబ, సీనియర్ జర్నలిస్ట్ ఎస్ఎల్ ముత్యం అన్నారు. గురువారం పట్టణంలోని షాదీఖానా ఫంక్షన్ హాల్‌లో జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబ జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. సమాజంలో విష సంస్కృతి పెరిగిందని ఇది విద్యార్థులను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. కొందరు విద్యను వ్యాపారంగా మార్చుకున్నారని, ర్యాంకుల వెంట పరుగెడుతూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. భారత నాస్తిక సమాజం జాతీయ అధ్యక్షుడు సారయ్య మాట్లాడుతూ.. మూఢత్వాలను తరిమి కొట్టాలన్నారు. బానోతు ఉక్లా, రామ్మూర్తి, పాపారావు, సుగుణ, గణేష్, సింధు పాల్గొన్నారు.

పునరుద్ధరించండి..

టేకులపల్లి: ఏజెన్సీ జీఓ 3 పునరుద్ధరించాలని టీఎస్‌టీటీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు టీఎస్‌టీటీఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని టేకులపల్లి, శంభునిగూడెం, మద్రాస్ తండా, సులానగర్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏజెన్సీలో జీఓ 3ను మళ్లీ అమలు చేయాలని, ఏజెన్సీ అభ్యర్థులతో ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పేర్కొన్నారు. ఏహెచ్‌ఆర్‌ఏ జీఓను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



శంభునిగూడెం పాఠశాలలో సభ్యత్వం అందజేస్తున్న లక్ష్మణ్ నాయక్

ఉద్యోగులకు ముగిసిన శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా మైన్స్‌లో అన్ని మైన్స్, డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ముగింపు కార్యక్రమం గురువారం ఆర్‌సీఓఏ క్లబ్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా ఏరియా ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి హాజరయ్యారు. మాట్లాడుతూ. ఈ పదిరోజుల్లో శిక్షణ పొందిన అంశాలను గనుల్లో, డిపార్ట్‌మెంట్‌లలో అమలు పరుస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గనుల్లో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా గ్రత్తలు పాటించాలని సూచించారు. డీజీఎం పర్సనల్ బి.శివకేశవరావు, ఎంవీటీసీ మేనేజర్ జి.లక్ష్మణ్, వీటీసీ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్‌రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, వీటీసీ స్టాఫ్ పాల్గొన్నారు.

డాక్టర్ విజేందర్‌రావు మృతికి సంతాపం

కొత్తగూడెంటౌన్: డాక్టర్ విజేందర్ మరణం తీరని లోటని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన సమావేశంలో లక్కినేని సత్యనారాయణ మాట్లాడారు. డాక్టర్ విజేందర్ మానవ సేవయే మాధవ సేవగా భావించి వైద్యం అందించారన్నారు. కార్యక్రమంలో తోట మల్లేశ్వరావు, రవిచంద్ర, సాదిక్‌పాషా, దూదిపాల రవికుమార్, ప్రతిభ పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం పట్టణంలోని ఆర్థోపెడిక్ డాక్టర్ విజేందర్‌రావు అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందారు. పట్టణంలో ప్రముఖ వైద్యులుగా ఆయనకు ఎంతో పేరు ఉంది. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, పట్టణంలోని వైద్యులు నాగరాజు, కృష్ణప్రసాద్, రంగారావు, బాబూరావు, బీవీరావు, ప్రవీణ్, కిడ్నీ డాక్టర్ రాజశేఖర్, రాజేశఖర్, దళిత సంఘం నాయకులు గురువారం మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. మద్దెల శివకుమార్, అంతోటిపాల్, గిద్ద పరంజ్యోతి, పూల రవీందర్, కొప్పరి నవతన్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామ పంచాయతీలోని ఎస్‌కే మాషీన్ తల సేమియా వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న కొల్లి ఫౌండేషన్ ఫౌండర్ కల్పనా చౌదరి బాధితురాలికి ఒక నెల మందులకు రూ.2500 ఎస్ఐ రమణారెడ్డి చేతుల మీదుగా గురువారం అందజేశారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



సరుకులు అందజేస్తున్న పాస్టర్ కబీర్‌దాస్

జూలూరుపాడు: ఖమ్మం మున్నేరు వరద బాధితులకు పడమటనర్సాపురం ఇమ్మానుయేలు బిలీవర్స్ చర్చి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులను గురువారం పంపిణీ చేసినట్లు పాస్టర్ కబీర్ దాస్ గురువారం స్థానిక విలేకరులకు తెలిపారు. సుమారు 20 వరదకి బియ్యం, నిత్యావసరాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టమ్



సౌండ్ సిస్టం అందజేస్తున్న పాషా

టేకులపల్లి: కుంటల్ల పంచాయతీ అందుగులగూడేనికి చెందిన గ్రామీణ వైద్యుడు ఎస్‌కే.పాషా కుంటల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టం, స్పీకర్ బాక్సులను వితరణ చేశారు. గురువారం పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం కె.దేవ్‌సింగ్‌కు వాటిని అందజేశారు.

పంటల పరిశీలన

సుజాతనగర్: జావ్లా తండా గ్రామ పరిధిలో తోగువాగు పొంగి నష్టపోయిన పంటలను కొత్తగూడెం ఏడీఏ నరసింహారావు ఆధ్వర్యంలో గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 50 ఎకరాల్లో 70 మంది రైతుల పంట నష్టం జరిగినట్లు అధికారులు ఈ సందర్భంగా ధృవీకరించారు. కార్యక్రమంలో ఏఓ జి.నర్మద, ఏఈఓ నరసింహా రైతులు పాల్గొన్నారు.

ఏచూరి మరణం సీపీఎంకు తీరని నష్టం

సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి లేని లోటు పూడ్చలేనిదని ఆ పార్టీ నాయకులు తెలిపారు. సీతారాం మృతి పట్ల స్థానిక పార్టీ కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఏచూరి లేకపోవటం దేశానికి, సీపీఎంకు తీరని నష్టం అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



జూలూరుపాడులో...



సుజాతనగర్‌లో...

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



కొత్తగూడెంరూరల్: మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న



టేకులపల్లి: పాతతండాలో సామూహిక సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

ఇల్లెందురూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి అన్నారు. మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ పాఠశాలల్లో గురువారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సహజంగా నీరు, ఆహారం, కలుషితమైనప్పుడే ప్రజలు అనారోగ్యం బారిన పడతారని, ఈ సమస్యను అధిగమించేందుకు స్వచ్ఛమైన నీటిని, పౌష్టికమైన ఆహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ పాఠశాలల్లో అందించే పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ రోహిణి, సరిత, బిందు, భారతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండా ఆశ్రమ గిరిజన పాఠశాలలో పోషణమాసం నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. కౌమర దశ బాలబాలికలకు పౌష్టికహారం తీసుకోవటం వల్ల ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. హెచ్ఎం భవానీ, సెక్టార్ సూపర్‌వైజర్ రమాదేవి, కల్యాణి, సూపర్‌వైజర్ శకుంతల, ఎస్ఎం నీల, సెక్రటరీ మహమ్మద్ ఇస్మాయిల్, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి ఉన్నారు.

టేకులపల్లి: పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు సీడీపీఓ కెఎం.తార అన్నారు. ఈ మేరకు గురువారం గంగారం సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మి ఆధ్వర్యంలో చంద్రుతండా, సులానగర్ సెక్టార్ సూపర్‌వైజర్ నిర్మల ఆధ్వర్యంలో రాంపురం జీపీ పాతతండాలో పోషణ్ అభియాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. సామూహిక సీమంతాలు నిర్వహించారు. హెచ్ఎం బాలు, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, సుజాత, నాగమణి, సునీత, బానోతు సరోజిని, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

సమీపిస్తున్న 'నిమజ్జనం' గడువు..



నిమజ్జనం కోసం సత్యనారాయణపురం చెరువును పరిశీలిస్తున్న చైర్మన్ డీవీ, అధికారులు

- అయోమయంలో గణేష్ మండలిలు
- 'ఆట్ నెంబర్ చెరువు' వద్ద వెలిసిన హెచ్చరిక బోర్డు

ఇల్లెందు: ఇల్లెందులో నిమజ్జనానికి అనుకూలంగా ఏ అవకాశం లే క ఈ దఫా తలనొప్పిగా మారింది. నూటికి నూరు శాతం ఆట్ నెంబర్ చెరువులోనే ఈ దఫా నిమజ్జనం అంటూ ఆ చెరువు మీద గంపెడాశలు పెట్టుకోగా గణేష్ మండపాల ఆశలు ఆడియాశలు అయ్యాయి. అక్కడి రైతులు అడ్డుకోవటంతో అయోమయం ఆవరించింది.

ఇక నిమజ్జనం గడువు సమీపిస్తుండటంతో హైరానా మొదలైంది. తాజాగా పట్టణ పరిధిలోని 1,2వ వార్డుల పరిధిలోని సత్యనారాయణపురం చెరువును పరిశీలించారు. కానీ అంతగా ఉపయోగం ఉన్నట్లు కనిపించటం లేదని అధికారులు,ప్రజాప్రతినిధులు మధనపడుతున్నారు. ఈ నెల 17న గణేష్ నిమజ్జనం నిర్వహించాలని గణేష్ మండలిలు నిర్ణయించారు. నిమజ్జనానికి మధ్య నాలుగు రోజులే గడువు ఉండటంతో అటు పట్టణ గణేష్ మండలి, ఇటు అధికారులు,ప్రజాప్రతినిధుల్లో టెన్షన్ పెరిగింది. ఘనంగా విగ్రహాల వీడ్కోలు పలికేందుకు పట్టణంలో స్టేజీ నిర్మాణం కోసం సమాలోచనలు చేయాల్సిన తరుణంలో నిమజ్జనం చేసే చెరువు అందుబాటులో లేకపోవటం, ఏ చెరువులో నిమజ్జనం చేయాలో నిర్ధారణకు రాకపోవటంతో ఈ దఫా నిమజ్జనం తలకు మించిన భారంగా మారింది.

సత్యనారాయణపురం చెరువు సందర్శన..

సమాలోచనల మధ్య సత్యనారాయణపురం చెరువును గురువారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ బి. సూర్యలతో పాటు కాంగ్రెస్ నాయకులు దొడ్డా డానియేల్, మడుగు సాంబమూర్తి, సీహెచ్ వెంకన్న, భక్త మండలి తరుపున సంజీవరెడ్డి, కౌన్సిలర్ వార రవి తదితరులు ఉన్నారు.

గణేష్ మండపాల్లో పూజలు, అన్నదానం

ఇల్లెందురూరల్: సల్లంగ చూడయ్యా.. మా బొజ్జ గణపయ్య.. అంటూ భక్తులు గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం హనుమంతులపాడులో మహిళలు గణేష్ మండపంలో కుంకుమ పూజ చేశారు. బాలాజీనగర్ గ్రామంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ హోమం నిర్వహించారు. పలు గ్రామాలలో గణేష్ మంటపాల వద్ద భక్తులకు మహాఅన్న ప్రసాదం అందించారు.

ఇల్లెందు: పట్టణంలోని కోర్టు ఏరియా, లేక్ వ్యూ పార్క్, ఎల్‌బీఎస్ నగర్, నెంబర్-2 బస్తీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద గురువారం అన్నదానం కార్యక్రమాలను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కౌన్సిలర్లు అంకెపాక నవీన్, కుమ్మరి రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, మండపాల కమిటీ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పాల్వంచ: అన్నదానం ఎంతో పవిత్ర కార్యం అని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం పట్టణంలోని పాత పాల్వంచ, గడియకట్ట, గొండ్ల బజార్, శివనగర్‌లలో గణేష్ మండపాల్లో ఆయన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో బరపటి వాసుదేవరావు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, వై.వెంకటేశ్వర్లు, కందుకూరి రాము తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లో... పాల్వంచ పట్టణం శివనగర్‌లోని వినాయక మండపం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమాన్ని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యులు సంతోష్‌రెడ్డి, గణేష్, ప్రకాష్, రిషి, చింటూ, మురళీ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందురూరల్: హనుమంతులపాడులో కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



ఇల్లెందు: అన్నదానం ప్రారంభిస్తున్న చైర్మన్ డీవీ



పాల్వంచలో కొత్వాల శ్రీనివాసరావు



శివనగర్‌లో.. రాజుగౌడ్